మురిపించిన తారల సందడి



ఆలయంలో పూజలు చేస్తున్న సందీప్ కిషన్, సంధ్య, నక్కిన త్రినాధరావు తదితరులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: సతకంపట్టు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ ఎత్తున దసరా ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. సినీ హీరో సందీప్ కిషన్, దర్శకుడు నక్కిన త్రినాథరావు, హీరోయిన్ సంధ్య, సినీ నటులు విక్రమ్ సహదేవ్, తారక్ పొన్నాప్ప కనకదుర్గను దర్శించుకున్నారు. పట్టణంలో నిర్వహించిన రథ యాత్రలో వీరు పాల్గొన్నారు.

సైసై జోడెడ్ల బండీ!



మైదానంలో పరుగులు తీస్తున్న ఎడ్లబండి

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు శనివారం జరిగాయి. లలితాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక జడ్పీ పాఠశాల మైదానంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 21 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ఒకటి నుంచి ఏడు బహుమతులు వరుసగా.. పరువాడ నాయుడు (అర్జునగిరి), కుమార్ (బోయిపాడు), నాయుడు (వల్లంపూడి), నూకరాజు (చుక్కపల్లి), మోహన్ (కె.జె.పురం), గండి వెంకటరావు (వావిలపాడు), కోటపాడు నాగముని గెలుపొందారు. విజేతలకు సర్పంచి అప్పలనాయుడు, నాయకులు నారాయణమూర్తి, సోమునాయుడు, జగన్నాథనాయుడు, కొత్తమ్మ శ్రీను, అచ్చెంనాయుడు అందజేశారు.

పాడికి అండగా.. బీమా తోడుగా..

అతివృష్టి, అనావృష్టితో ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే వరకు నమ్మకం ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతును పాడి ఆదుకుంటోంది. జిల్లాలో అధిక శాతం రైతులు పాడిపై ఆధారపడ్డారు. ప్రతి రైతు రెండుకు తక్కువ లేకుండా పశువులు పెంచుతున్నారు. ఇప్పుడు వీటి ధరలు భారీగానే ఉన్నాయి. అనుకోని పరిస్థితుల్లో పశువులు చనిపోతే రైతు ఆర్థికంగా నష్టపోతున్నాడు. అందుకే వారికి అండగా కూటమి ప్రభుత్వం రాయితీతో కూడిన పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది.

అనకాపల్లి, న్యూస్‌టుడే

పశుబీమా పథకం కింద నాటు జాతికి చెందిన పశువులకు రూ. 15 వేలు, సంకర జాతికి రూ. 30 వేల నుంచి రూ. 1.20 లక్షల వరకు బీమా చేసుకోవచ్చు. గొర్రె, మేక, పందికి రూ. 6 వేల బీమా వర్తిస్తుంది. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లకు బీమా ఉంటుంది.

మార్గదర్శకాలు: తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులకు 80 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. బీమా చేసే సమయంలో బ్యాంక్ పాసు పుస్తకం, తెల్ల రేషన్‌కార్డు అందివ్వాలి. బీమా చేసిన తర్వాత పశువులకు ట్యాగ్ వేస్తారు. పశువు ప్రమాదవశాత్తు లేదా జబ్బు చేసి మరణిస్తే వెంటనే సమీప సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. పశువైద్యాధికారులు పోస్టుమార్టం చేస్తారు. పశువును అమ్మిన పక్షంలో వారం లోపు బీమా కంపెనీకి సమాచారం అందిస్తే రైతు పేరు మారుస్తారు.



తుమ్మపాలలో పశువుల సంత



అవగాహన కల్పిస్తున్నాం

పశు బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంతవరకు అనకాపల్లి మండలంలో 830, కశింకోట మండలంలో 550 పశువులకు బీమా చేశారు. – సౌజన్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ, అనకాపల్లి

పశువుల బీమా ప్రీమియం వివరాలు (రూ.లలో)

	తెల్ల రేషన్‌కార్డుదారులకు		ఇతరులకు	
విలువ	ప్రభుత్వం	రైతువాటా	ప్రభుత్వం	రైతువాటా
15,000	768	198	480	497
30,000	1,536	397	960	994
50,000	1,536	1,723	960	2,319
75,000	1,536	3,379	960	3,975
1,00,000	1,536	5,036	960	5,632
1,20,000	1,536	6,361	960	6,957

మేక, గొర్రె, పంది బీమా విలువ రూ. 6 వేలు. తెల్లరేషన్‌కార్డు ఉంటే రైతు చెల్లించాల్సింది రూ. 36. రేషన్‌కార్డు లేకపోతే రూ. 90.

చిన్న పరిశ్రమకు దన్ను

అచ్యుతాపురం సెజ్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం

ఒకేచోట బహుళ తయారీ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం





ఈనాడు, అనకాపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అచ్యుతాపురం సెజ్‌లో ప్రస్తుతం భారీ, మధ్యతరహా పరిశ్రమలే ఎక్కువ ఉన్నాయి. వాటికి అనుబంధంగా చిన్నచిన్న కంపెనీలు పెట్టడానికి అవకాశం ఉంది. అయితే అక్కడి భూముల విలువ, నిర్మాణాలకు అయ్యే పెట్టుబడి భారీగా ఉండడంతో ఔత్సాహికులు ముందుకు రాలేకపోతున్నారు. ఇలాంటి వారి కోసం కూటమి ప్రభుత్వం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)ను అందుబాటులోకి తెస్తోంది. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన, పట్టుదల, సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నవారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తోంది. బహుళ తయారీ యూనిట్లు అన్నీ ఒకే చోట ఏర్పాటు చేసుకునేలా ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పించనుంది. వైకాపా హయాంలో రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వక చతికిలపడిన పారిశ్రామిక రంగాన్ని ముందుకు నడిపించేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు.



అచ్యుతాపురంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ సముదాయం

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థికమండలి (సెజ్)ని 9,297 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. దీన్ని ఏర్పాటుచేసినా, అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొచ్చే దిశగా దృష్టి పెట్టలేదు. అన్నదాతల వద్ద బలవంతంగా సేకరించిన భూములు చాలాకాలం ఖాళీగానే ఉండిపోయాయి. రాష్ట్ర విభజన తర్వాత తెదేపా ప్రభుత్వం ఇక్కడ ఖాళీ భూముల్లో 2,200 ఎకరాలను డీనోటిఫై చేసి సెజ్ నుంచి తప్పించింది. దీంతో నాన్ సెజ్ ఏరియాలో భారీగా పరిశ్రమలు వచ్చాయి. గతంలో తెదేపా ప్రభుత్వం కృషితో ఏషియన్ పెయింట్స్, సెయింట్ గోబైన్, ఇండియన్ ఆయిల్, పెప్సీ, లారస్, ఎంఎస్ఎంఈ శిక్షణా కేంద్రం వంటి ప్రతిష్ఠాత్మకంగా సంస్థలు ఇక్కడ అడుగుపెట్టాయి. తాజాగా రూ 15.29 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ చిన్న పరిశ్రమలకు దన్నుగా నిలవనుంది. పెట్టుబడి భారం తగ్గించేలా ప్లగ్ ప్లే విధానంలో యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా సదుపాయాలను కల్పించబోతున్నారు.

సెజ్‌కి నూతన కళ..

అచ్యుతాపురం నాన్ సెజ్‌లో 5 ఎకరాల పరిధిలో చిన్న చిన్న తయారీ యూనిట్లు ఏర్పాటుకు వీలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈ-సీడీపీ) కింద కేంద్రం రూ.11.86 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.23 కోట్లు సమకూర్చుతున్నాయి. ప్రస్తుతం రూ.5.20 కోట్లతో భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. 40 యూనిట్లు ఏర్పాటు చేయడానికి వీలుగా రెండు బ్లాక్‌లుగా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్‌లోగా వీటిని పూర్తిచేయనున్నారు.

వీటి ద్వారా ఖాళీ స్థలాలకు మోక్షం కలగడంతో పాటు సెజ్‌లకు కొత్త కళ రాబోతోంది. ఈ ఎఫ్ఎఫ్‌సీ ద్వారా రూ.120 కోట్ల వరకు పెట్టుబడులు, 250 మందికి ప్రత్యక్షంగా, మరో 200 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



అనుబంధ పరిశ్రమలకు అవకాశం: పరిశ్రమలు పెట్టాలనే ఆలోచన, సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నవారు ముందుకొస్తే ఎఫ్ఎఫ్ సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తాం. ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు అనుబంధంగా యూనిట్లు నెలకొల్పడానికి ఈ కాంప్లెక్స్ ఉపయోగపడుతుంది. అయిదెకరాల్లో రెండు బ్లాక్‌లుగా 40 యూనిట్లను ఏర్పాటుచేస్తున్నాం. దీని వల్ల పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది. చిన్న పరిశ్రమలకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

–హరిప్రసాదరావు, జడ్ఎం, ఏపీఐఐసీ, అచ్యుతాపురం

జోరు.. తగ్గని హుషారు!

స్కేటింగ్‌లో అదరగొడుతున్న నర్సీపట్నం చిన్నారులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

నర్సీపట్నం బాలలు స్కేటింగ్ క్రీడలో పట్టణానికి పేరు తెస్తున్నారు. ఇప్పటికే ఎందరో వీటిలో పతకాలు గెలుపొందారు. ఇప్పుడు ఏకంగా ఎనిమిది మంది చిన్నారులు రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న వీరంతా ఈ క్రీడలో తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు.

ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నుంచి మొత్తం 16 మంది బాలలు పాల్గొన్నారు. వీరిలో 8 మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఏడు నుంచి తొమ్మిదేళ్ల లోపు వయసు కేటగిరిలో రింక్, రోడ్డు విభాగాల్లో ఒక్కొక్కరు రెండు మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. చిన్న వయసులోనే వీరుచూపిన ప్రతిభ వీరికి చక్కటి అవకాశాన్ని తెచ్చిపెట్టింది. త్వరలో అఖిల భారత స్కేటింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే సదవకాశం వీరిని వరించింది. ఇందులో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక సాధన చేస్తున్నారు.



రెండు స్వర్ణాలతో..: నాతవరం మండలంలోని ములగపూడికి చెందిన **అనిష్** నాలుగో తరగతి చదువుతున్నాడు. గత కొంత కాలంగా నర్సీపట్నంలోని రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రి అర్జున ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాకినాడలోని 500 అలాగే 1000 మీటర్ల రింక్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుపొందాడు. రోడ్డు విభాగంలో ఒక రజతాన్ని సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు జాతీయ పోటీలపై గురిపెట్టి సాధన చేస్తున్నాడు.



వేగమే ప్రత్యేకత

నాలుగో తరగతి విద్యార్థిని శ్రీ **ఆద్య** స్కేటింగ్‌లోని వేగం అందరిని అబ్బురపరుస్తుంది. నర్సీపట్నంలోని అమరావతి స్కూల్‌లో చదువుతోంది. ఈమె తండ్రి భవానీ ప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఈ బాలికకు కాకినాడ పోటీల్లో రోడ్డు అలాగే వెయ్యి మీటర్ల రింక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. 500 మీటర్ల రింక్‌లో ఒక రజతం గెలుపొందింది. పత్రికల్లోని స్కేటింగ్ విజేతల గురించి చదివి ఈ క్రీడ పట్ల మక్కువతో నర్సీపట్నంలో గత ఏడాదిగా శిక్షణ పొందుతోంది.



సాటిరారెవరు: నాలుగో తరగతి విద్యార్థి **సాత్విక్** తనకు ఎవరూ సాటి రారని నిరూపించుకుంటున్నాడు. నర్సీపట్నంలోని విద్యాంజలిలో చదువుతున్న ఈ బాలుడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. గతంలో జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. చదువులో రాణిస్తూనే ఈ క్రీడలోనూ దూసుకుపోతున్నాడు. కాకినాడ పోటీల్లో రోడ్డు, 500 మీటర్ల రింక్ విభాగాల్లో రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లో పతకం లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

ఏడేళ్లకే మూడు పతకాలు



నర్సీపట్నానికి చెందిన **మాన్వితకు** కాకినాడ పోటీల్లో మూడు పతకాలు లభించాయి. అమరావతి స్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ఏడు నుంచి తొమ్మిది ఏళ్ల లోపు విభాగంలో రోడ్డు, వెయ్యి మీటర్ల రింక్‌ల్లో రెండు రజతాలు లభించాయి. 500 మీటర్ల రింక్‌లో ఒక కాంస్య పతకం దక్కింది. తండ్రి ఉదయ్ వ్యాపారి. ఏడేళ్ల వయస్సులోనే అత్యంత వేగంగా రింక్‌లో దూసుకుపోతున్న ఈ చిన్నారి విన్యాసం ఆకట్టుకుంటోంది.



నర్సీపట్నంలో బాలల స్కేటింగ్ సాధన

తొలుతే విజయం



సాయి కిడ్స్ క్యాంప్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విశాంక్‌కు స్కేటింగ్‌లో తొలి ప్రయత్నంలోనే విజయం వరించింది. ఇతడి తండ్రి రాజేంద్ర ప్రసాద్ వ్యాపారి. ఏడాదిన్నరగా ఈ క్రీడలో సాధన చేస్తున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో తొలిసారిగా పాల్గొని రింక్ పోటీల్లో రజత పతకాన్ని సాధించాడు.

విన్యాసాల్లో దిట్ట



చిన్న వయసులోనే స్కేటింగ్‌లో పలు విన్యాసాలతో అందరిని ఆకట్టుకుంటోంది **తన్విక**. నర్సీపట్నంలోని శ్రీ చైతన్య ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో అయిదో తరగతి చదువుతోంది. నర్సీపట్నంలోని రింక్‌లో రయ్ రయ్ మని దూసుకుపోతున్న చిన్నారులను చూసి ఈ క్రీడలో శిక్షణకు చేరింది. ఏడాదిగా సాధన చేస్తూ జిల్లా పోటీల్లో పతకాలు సాధించింది. కోచ్ ప్రత్యేక తర్ఫీదుతో ఇప్పుడు కాకినాడలో వెయ్యి మీటర్ల రింక్‌లో ఒక రజతం, రోడ్డులో కాంస్య పతకాన్ని గెలుపొందింది. విన్యాసాలకు తోడు వేగం ఈ చిన్నారి ప్రత్యేకతలు.

స్కేటింగ్‌లో 'రాజా'



నర్సీపట్నంలోని విద్యాంజలి పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఈ బాలుడి పేరు **రాజా రుషిక్**. స్కేటింగ్‌లో రాజాగా అందరూ ఆ చిన్నారిని కొనియాడుతుంటారు. తోటి పిల్లలు స్కేటింగ్‌లో రాణించడం చూసి రింక్‌లో శిక్షణకు చేరాడు. జిల్లా పోటీల్లో పతకాలు గెలుపొందాడు. ఇప్పుడు కాకినాడలోని 500 మీటర్ల రింక్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం కోసం మరింత సాధన చేస్తున్నాడు.

పండగ వేళ కొండంత విషాదం

★ మేనమామతో ఇంటికెళ్తూ చిన్నారి దుర్మరణం

★ మద్యం మత్తులో యువకుల డ్రైవింగ్‌తో దుర్ఘటన



గాయపడిన నమ్మి రమణమూర్తి

రావికమతం, న్యూస్‌టుడే: దసరా పండగకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు ఆటపాటలతో ఆనందంగా గడిపాడు. సెలవులు పూర్తవడంతో మేనమామతో కలిసి తిరిగి ఇంటికి బయలుదేరాడు. కానీ దురదృష్టవశాత్తు బాలుడు ఇంటికి చేరలేదు. అటు నుంచి అటే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. పూటుగా మద్యం తాగిన ముగ్గురు యువకుల నిర్లక్ష్యం ముక్కుపచ్చలారని ఆ బాలుడిని బలితీసుకుంది. కన్నవారి కలలను సమాధి చేసింది. తట్టబంద కూడలికి కూతవేటు దూరంలో ఆదివారం సాయంత్రం ఈ విషాద ఘటన చేసుకుంది. బాలుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. కశింకోట మండలం తాళ్లపాలెం సమీపాన గోకివాడపాలెం గ్రామానికి చెందిన గోకివాడ జానకీరామ్ (10) అక్కడి ప్రభుత్వ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో తట్టబంద శివారు బూరుగుపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో ఆదివారం సాయంత్రం మేనమామ నమ్మి రమణమూర్తి ద్విచక్ర వాహనంపై ఆ బాలుడిని వారి సొంతూరు గోకివాడపాలెంకు తీసుకెళ్తున్నాడు. రాజాం - తట్టబంద రోడ్డు మార్గంలో సాయినగర్ కూడలి దాటాక బుచ్చెయ్యపేట మండలం గొర్లెపాలెంకు చెందిన మందల చిరంజీవి, దాసరి బాబూరావు, వెలుగుల పోతురాజు పూటుగా మద్యం తాగి ఒకే బైక్‌పై తోటల మధ్యలో నుంచి వేగంగా వస్తూ రమణమూర్తి వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న బాలుడు జానకీరామ్, రమణమూర్తి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృత్యువాత పడ్డాడు. ఇదే ప్రమాదంలో గాయపడిన రమణమూర్తి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. తట్టబంద సర్పంచి గోకివాడ రమణ బాలుడి మృతి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. జానకీరామ్ పెదమామయ్య నమ్మి చినబాబు రావికమతం పోలీసులకు సమాచారం అందించాడు. ఈ ఘటనపై అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి వర్గాల నుంచి సమాచారం అందిందని, బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని ఎస్.ఐ రఘువర్మ తెలిపారు.



జానకీ రామ్ (పాతచిత్రం)

అంగరంగ వైభవంగా
శూలాల ఉత్సవం



అందలాపల్లిలోని శ్రీభగీరథీ అమ్మవారు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అందలాపల్లి శ్రీభగీరథీ అమ్మవారి శూలాల ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 4 గంటలకు భగీరథీ అమ్మవారిని విజయదుర్గాదేవిగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సమర్పించారు. హరిపాలెంలో శూలాలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంతోషిమాత ఆలయం నుంచి సంప్రదాయ వస్త్రాలను ధరించిన భక్తులు లయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ రామాలయానికి, హరిగిరి క్షేత్రంలోని విజయదుర్గమ్మ ఆలయానికి వచ్చారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో శూలాలు ధరించిన భక్తులు నడిచారు. హాజరైన ప్రజలతో అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు కిక్కిరిసింది. భారీ స్థాయిలో వెలిగించిన మందుగుండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అచ్యుతాపురం, రాంబిల్లి సీఐలు నమ్మి గణేష్, సీహెచ్.నర్సింగరావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో శూలాల మహోత్సవంలో పాల్గొన్నారు.

★ తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో కమిటీ ఛైర్మన్ మీరుబాబు సారథ్యంలో భక్తులు బుగ్గ, గంప, నాలుక, రథం శూలాలను ధరించి ప్రధాన రహదారి నుంచి దుర్గమ్మ ఆలయం వరకు నడిచి వెళ్లారు. యువకుల దేవతా మూర్తుల వేషధారణ ఆకట్టుకుంది. ఆలయానికి వెళ్లేవరకు రోడ్డుకు ఇరువైపులా ప్రజలు మానవహారంగా ఏర్పడి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాన్ని నడిపించారు. ఊరంతా విద్యుత్తు దీపాలు అమర్చారు.



గంపశూలం ధరించి హరిపాలెం బయలుదేరిన భక్తుడు



తిమ్మరాజుపేటలో అగ్నిగుండంపై నడుస్తూ..

కనులపండువగా చక్రస్నానం



వినోదోత్సవంలో భాగంగా భక్తులను బంధించి ప్రశ్నిస్తున్న అర్చకులు

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. శనివారం ఉదయం ఆలయంలో స్వామివారికి చూర్ణోత్సవం, అద్దపు సేవ జరిపారు. తర్వాత తిరువీధిలో వినోదోత్సవాన్ని చేపట్టారు. మృగవేటలో స్వామివారు తన ఉంగరాన్ని పోగొట్టుకోగా, దీన్ని వెతికే క్రమంలో పలువురిని అనుమానిస్తూ, ఉంగరం కోసం వెతికే కార్యక్రమం నవ్వులు పూయించింది. తుదకు ఉంగరం స్వామివారి వద్దనే ఉండటంతో, తిరిగి ఆలయానికి వెళతారు. ఇక్కడ లక్ష్మీసంవాదం జరిపారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం చేపట్టారు. సాయంత్రం ఆలయంలో ఉత్సవమూర్తులకు శమీ పూజ జరిపారు. పేటలోని దుర్గానగర్, బృందావనం దుర్గాలమ్మ చెట్టు వద్ద ఆలయాల్లో శనివారం శాఖ మంత్రి అనిత పూజలు నిర్వహించారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి శ్రీను, బి.కాశీవిశ్వనాథ్, జి.రాజబాబు, యాళ్ల వరహాలబాబు, యాళ్ల సన్నబాబు, ఆచంట దొర, పి.విలియంకేరీ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట బృందావనం దుర్గాలమ్మ చెట్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి అనిత

★ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. సారిపల్లిపాలెంలోని తన నివాసంలో ఆదివారం పలువురు వివిధ సమస్యలపై వినతులు అందించారు. నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నెలరోజుల పాటు నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ నాయకులతో కలిసి అందించారు.

★ విజయవాడ వరద బాధితులకు బీసీ విభాగం, గీత కార్మికుల తరపున గుత్తుర్తి పాండురంగ, కట్టా అప్పలకొండ, పిల్లి రాంబాబు, కట్టా శ్రీను రూ. 10 వేల డీడీని మంత్రికి అందించారు. నాయకులు గింజాల లక్ష్మణరావు, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యథావిధిగా నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు కలెక్టరేట్ వీసీ హాల్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, సంయుక్త కలెక్టర్ జాహ్నవి, జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టారు.

శ్మశానాల అభివృద్ధికి అదనంగా నిధులు : అయ్యన్న


అయ్యన్నను పూలమాలతో సత్కరిస్తున్న పీలాగోవింద సత్యనారాయణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలను సోమవారం నుంచి సందడి వాతావరణంలో నిర్వహించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు, పంచాయతీరాజ్ అధికారులతో ఆదివారం సాయంత్రం సమావేశమయ్యారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 13 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ జనవరిలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. రహదారులు, శ్మశానాల అభివృద్ధికి అదనంగా నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. మండలానికి పది శ్మశానాలను తొలి విడతలో అభివృద్ధి చేయాలని సూచించారు. వారం రోజుల్లోగా ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. అనంతరం సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై తెదేపా నాయకులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించనున్నట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, పంచాయతీరాజ్ డీఈఈ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నతో పీలా గోవిందు భేటీ

శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఏపీ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం భేటీ అయ్యారు. సంస్థ పరంగా ప్రస్తుత ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రతిపాదనలు తదితర అంశాలను అయ్యన్నకు వివరించారు. ఆయన వెంట తెదేపా కశింకోట మండల అధ్యక్షుడు కాయల మురళీధర్, కార్యకర్తలు ఉన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద దసరా వేడుకల్లో భాగంగా చిన్నారుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ ప్రదర్శనను తిలకించి చిన్నారులను అభినందించారు. ముందుగా జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేసిన కొణతాల పలువీధుల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద అమ్మవార్లను దర్శించుకున్నారు.


చిన్నారులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నంకు చెందిన **కామిరెడ్డి దుష్య సాత్విక్** రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి ఏడు నుంచి తొమ్మిదేళ్ల కేటగిరీలో 250 మీటర్ల రింక్‌లో రజతం, 750 మీటర్ల రింక్, రోడ్డు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యాంజలి పాఠశాల ఛైర్మన్ అక్షజ్ కృష్ణ, కరస్పాండెంట్ శాంతి సాత్విక్‌ను ఆదివారం అభినందించారు.

వణికించిన జ్ఞాపకానికి పదేళ్లు

హుద్‌హుద్... ఈపేరు చెబితే ఉమ్మడి విశాఖ జిల్లా వాసులు వణికిపోతారు. పెనుగాలి విధ్వంసం అంటే ఏ స్థాయిలో ఉంటుందో విశాఖ వాసులకు చూపించిన తుపాను ఇది. చరిత్రలో ఎన్నడూ చూడని విపత్తుగా నిలిచిపోయింది. ఈ ఘోర విధ్వంసం జరిగిన ఈనెల 12కి పదేళ్లు పూర్తయింది.


సెజ్ రోడ్డులో నేలకూలిన విద్యుత్తు స్తంభాలు



అచ్యుతాపురం ఉన్నత పాఠశాల పరిస్థితి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

పదేళ్ల క్రితం అంటే 2014 అక్టోబర్ 12న హుద్‌హుద్ తుపాను పూడిమడక సమీపంలో తీరాన్ని దాటింది. వాతావరణశాఖ అధికారుల అంచనాలకు మించి 240-260 కిలోమీటర్ల వేగంతో వీచిన ప్రచండ గాలులు ప్రజా జీవితాన్ని అస్తవ్యస్తం చేశాయి. గాలల వేగానికి పూడిమడక గ్రామంలో చెట్లు, తాటాకు, రేకులషెడ్లు నామరూపాలు లేకుండాపోయాయి. పూడిమడక స్వరూపమే మారిపోయి గుర్తుపట్టలేని విధంగా తయారైంది. సముద్రం, తుపానులతో సహజీవనం చేసే మత్స్యకారులు సైతం గజగజ వణికిపోయారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని (సెజ్) 22 వేల మంది మహిళలు పనిచేసే బ్రాండిక్స్ అపెరల్ సిటీ నామరూపాలు లేకుండా పోయింది. పెనుగాలులకు తోడు 55 సెంటీమీటర్ల వర్షపాతం కారణంగా సెజ్‌లో వందల కంపెనీలు నేలమట్టమయ్యాయి. హైటెన్షన్ విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. 15 రోజుల వరకు విద్యుత్తు లేక, తాగునీరు అందక ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అనారోగ్యం కలిగినా, అత్యవసర సేవల కోసం ఆసుపత్రికి వెళ్దామన్నా రోడ్లమీద కూలిన భారీవృక్షాల కారణంగా ఊరు దాటలేకపోయారు. చీకట్లో ప్రజలు కాళరాత్రిని తలపించే గ్రామాల్లో పిల్లలు, వృద్ధులతో జాగారం చేశారు.


రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న ప్రజలు

చంద్రబాబు కృషితో విశాఖ పునర్నిర్మాణం

హుద్‌హుద్ చేసిన గాయం నుంచి విశాఖవాసులను కోలుకునేలా అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు నాయుడు అవిరళ కృషి చేశారు. విశాఖలో సాధారణ జనజీవనం ప్రారంభమయ్యే వరకు ఇక్కడే ఉంటానని ప్రతిజ్ఞ చేసి మరీ పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టారు. ప్రజలకు ఆహారం, నిత్యావసర సరకులు.. అన్నీ అందేలా పర్యవేక్షించారు. మూడు రోజుల్లోనే విశాఖకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించడంతో పాటు మళ్లీ ఇలాంటి విపత్తు వచ్చినా సరఫరాకు ఇబ్బంది ఉండకుండా భూగర్భ కేబుల్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు అప్పుడే ప్రకటించారు. 3700 కోట్లతో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించారు. చంద్రబాబు కృషి మూలంగానే పూడిమడక, తంతడి, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో ఇన్ఫోసిస్ సంస్థ 600 గృహాలను నిర్మించింది. గృహనిర్మాణశాఖ ద్వారా మరో 600 ఇళ్లను పూడిమడకలో నిర్మించి మత్స్యకారులకు అందించారు. ఈ చర్యలతో తక్కువ కాలంలోనే పూడిమడకలో యథాతథ పరిస్థితులు నెలకొన్నాయి.

ఆ రోజు మరిచిపోలేం

మత్స్యకారులను తుపానుపై అప్రమత్తం చేయడానికి ఎంతగా ప్రయత్నించినా ముందు వారు పెద్దగా పట్టించుకోలేదు. హుద్‌హుద్ తుపాను ముందురోజు సాయంత్రానికి వాతావరణంలో మార్పులు ప్రమాదకరంగా కనిపించాయి. దాంతో తుపాను విధులకు వచ్చిన కొందరు ఉన్నతాధికారులు సైతం భయపడి పూడిమడక నుంచి వెళ్లిపోయారు. నర్సీపట్నం ఏఎస్పీ సత్యఏసుబాబుతో సహా ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమే మిగిలాం. మత్స్యకారులను బలవంతంగా పునరావాస కేంద్రానికి తరలించాం. దాదాపు 3 వేల మంది ప్రాణాలను కాపాడగలిగిన సంతృప్తి మరువలేనిది. కళ్లముందే పూడిమడక నేలమట్టమైంది. పునరావాస కేంద్రాలు సైతం మునిగిపోయాయి. రెండురోజులపాటు పూడిమడకలోనే ఉండిపోయాం.


– శివ, పూర్వ తహసీల్దారు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రేవతి ప్రతిభ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లా క్రీడాకారిణి ప్రతిభ చూపారు. దేవరాపల్లికి చెందిన రేవతి జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఈమెను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.వెంకటరామ తదితరులు అభినందించారు.



తృతీయస్థానంలో నిలిచిన రేవతి

స్నేహితుడితో భోజనం చేసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మాకవరపాలెం, న్యూస్‌టుడే: పండగ రోజున చిన్ననాటి స్నేహితుడిని కలిసేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఒకరు శనివారం సాయంత్రం లచ్చన్నపాలెం వచ్చారు. రాత్రి వరకు కబుర్లు చెప్పుకొన్నారు. ఎనిమిది గంటల సమయంలో హోటల్‌కు వెళ్లి భోజనం చేసేందుకు బైక్‌పై ఇద్దరూ బయలుదేరారు. కొండల అగ్రహారం నల్లమారమ్మ ఆలయం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. స్నేహితుడు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఎస్సై దామోదర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన **లాలం స్వామి** (25) విశాఖపట్నంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. పండగకు ఇంటికి వచ్చిన అతడు లచ్చన్నపాలెంలోని స్నేహితుడు గంగాధర్‌ను కలిసేందుకు వచ్చారు. హోటల్‌లో భోజనం చేసేందుకు బైక్‌పై మాకవరపాలెం వస్తుండగా నల్లమారమ్మ ఆలయ సమీపంలో కోళ్ల లోడుతో వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. లారీ చక్రాలు మీదుగా వెళ్లడంతో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని తప్పించే క్రమంలో వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్వల్ప గాయాలైన గంగాధర్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జలగలమదుం వద్ద వివాహిత..

అనకాపల్లి పట్టణం: జాతీయ రహదారిపై జలగలమదుం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందింది. ట్రాఫిక్ ఎస్సై శేఖరం కథనం ప్రకారం.. గవరపాలెం అరుంధతినగర్‌కు చెందిన మునగపాక అప్పారావు, నాగమణి కొప్పాక వద్ద ఏలేరు కాలువలో దుర్గాదేవి ప్రతిమను నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా లారీ ఢీకొనడంతో నాగమణి (52) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన అప్పారావును పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

గండేపల్లి, న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కుతారు.. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో ముఠా గుట్టురట్టయింది. అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మురారి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటోఎక్కిన మరో మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ (40)తో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు (50), విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి (25), అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతి (30)ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు అభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది ఉన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలు, సెల్‌ఫోన్లు

చీడికాడ పొలాల్లో భారీ కొండచిలువ అలజడి

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ బొడ్డు వారి పొలాల్లో ఆదివారం సాయంత్రం భారీ కొండచిలువ అలజడి సృష్టించింది. రైతులు పొలాల్లో పనిచేస్తుండగా కొండచిలువ కనిపించింది. చూసిన వారంతా భయంతో పరుగులు తీశారు. కొంతసేపటి తర్వాత అటవీ శాఖ సిబ్బంది ద్వారా చీడికాడలోని తూర్పు కనుమల వన్యప్రాణి సంసరక్షణ సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించారు. వరి పొలంలో దూరిన కొండచిలువను ఎంతో శ్రమించి పట్టుకున్నారు. దీని పొడవు 10 అడుగుల వరకు ఉంటుందని సంస్థ ప్రతినిధి ప్రసాద్ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. కోనాం శివారు అటవీ ప్రాంతంలో దీన్ని విడిచిపెట్టామన్నారు.


పొలాల్లో పట్టుబడిన భారీ కొండచిలువ

9 తులాల బంగారం, నగదు అపహరణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: పట్టపగలు ఓ ఇంట్లో జరిగిన చోరీలో సుమారు 9 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ. 49 వేల నగదు చోరీ అయ్యాయి. ఈ సంఘటన నీలిగుంట పంచాయతీ శివారు జి.సన్యాసిరాజుపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామకృష్ణ బ్యాంకులో పొరుగు సేవల ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఇతను దసరా పండగకు అత్తవారి ఇంటికి వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న రామకృష్ణ తల్లి నాగరత్నం ఆదివారం పొలంలోకి వెళ్లింది. ఇంటి దగ్గర ఎవరూ లేకపోవడంతో, తలుపులకు ఉన్న గడియను పగలగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును దోచుకుపోయారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన నాగరత్నం తెరిచి ఉన్న బీరువా తలుపులు, చెల్లాచెదురుగా ఉన్న దుస్తులను చూసి అత్తవారి ఇంటికి వెళ్లిన కుమారుడికి చెప్పింది. ఇంటికి వచ్చిన రామకృష్ణ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.రాయవరం ఎస్సై విభీషణరావు, క్లూస్ టీం సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అపహరణకు గురైన బంగారం, వెండి ఆభరణాల వివరాలు నమోదు చేసుకున్నారు.


చిందరవందరగా పడేసిన దుస్తులు

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో భాగంగా ఎస్పీ ఎం. దీపిక కుమారుడు తవిష్‌తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. విశాఖపట్నంలోని కైలాసగిరిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా రోజు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగమన్నారు. వీటికి గౌరవిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదనపు ఎస్పీ దేవప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కుమారుడితో కలసి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్పీ దీపిక

పాల వాహనాన్ని ఢీకొన్న వ్యాన్

ఆరుగురు భవాని భక్తులకు గాయాలు

ఏలూరు, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిలిపి ఉన్న పాల వాహనాన్ని భవానీ భక్తులు ప్రయాణిస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ముకుందరాజుపేటకు చెందిన ఎనిమిది మంది భవాని భక్తులు ఓ వ్యానులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. మార్గం మధ్యలోని ఏలూరు నగర శివారు ఆశ్రం సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు పక్కన ఆపి ఉన్న పాల వాహనాన్ని వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు భవానీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. వారిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకరైన చెప్పా మాలశ్రీ ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవానీ భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ప్రమాద బాధితులకు అండగా ఉండాలని స్థానిక భాజపా నేతలకు సూచించారు.

గీతం దూర విద్యా కోర్సుల్లో ప్రవేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీకి అనుబంధంగా సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో 2024 విద్యా సంవత్సరానికి ఎంఏ ఇంగ్లిష్, బీఏ, బీకామ్ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల (నవంబరు) 15వ తేదీలోగా అందజేయాలన్నారు. వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం గీతం సీడీఎల్ వెబ్‌సైట్ cdl.gitam.edu ను పరిశీలించవచ్చన్నారు.

22న రైతాంగ సదస్సు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో ఉత్తరాంధ్ర రాష్ట్రంలో 13వ స్థానంలో ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా సత్యనారాయణ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకు రైతాంగాన్ని సన్నద్ధం చేసేందుకు ఈ నెల 22న అనకాపల్లి రోటరీ హాల్‌లో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆదివారం చెప్పారు. ఈ ప్రాజెక్టుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది పూర్తయితే ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు.

తీరంలో చేపల మృత్యువాత

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదతీనార్ల పంచాయతీ పరిధిలోని దొండవాక తీరంలో చేపలు మృత్యువాత పడ్డాయి. కొన్ని ఒడ్డుకు చేరగా, మరికొన్ని నీటిలో తేలుతూ కనిపించాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మత్స్యకారులతో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెటిరో మందుల పరిశ్రమ కాలుష్యం కారణంగానే చేపలు మృత్యువాత పడ్డాయని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ అధికారులు విచారణ చేసి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని మత్స్యకారులకు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.సోమేశ్వరరావు, బి.నూకరాజు, కె.కాశీరావు, సీహెచ్ సోమేశ్, గుర్రన్న, కె.కాశీ తదితరులు పాల్గొన్నారు.


చనిపోయిన చేపలను చూపుతున్న నాయకులు

16 ట్రావెల్స్ బస్సులపై కేసులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. పండగ ముగిసిన సందర్భంగా ఊర్లకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణం అవుతుండటంతో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా డీటీసీ జి.ఆదినారాయణ తెలిపారు. ఇప్పటి వరకు 50 బస్సులపై కేసులు నమోదు చేసి 9 బస్సులను సీజ్ చేసినట్లుగా తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఇలాగే తనిఖీలు కొనసాగుతాయన్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన లంకా అప్పలనాయుడు నక్కపల్లి హెటిరో పరిశ్రమలో పనిచేస్తూ, భార్య మౌనిక (26)తో కలిసి తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం మౌనికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి విధుల నుంచి ఇంటికి వచ్చి చూసిన అప్పలనాయుడు మౌనికను అడ్డురోడ్డులోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి తునికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ రమేష్‌బాబు సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	122
లైవ్	147	142
డ్రెస్డ్	213	254
స్కిన్‌లెస్	243	264

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

పల్లె పండగ నేటి నుంచి

కశింకోట, న్యూస్‌టుడే: పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో వీవీ.రవికుమార్ తెలిపారు. కశింకోటలో జరిగే కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలాగోవింద సత్యనారాయణ హాజరవుతారన్నారు. ఉదయం వెదురుపర్తి, బయ్యవరం, విస్సన్నపేట గ్రామాల్లో, సాయంత్రం కశింకోటలో నిర్వహిస్తామన్నారు.

పాయకరావుపేట: పల్లె పండగను సోమవారం నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ జయప్రకాష్ రావు తెలిపారు. నామవరం, సీతారాంపురం, మంగవరం గ్రామాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 19 వరకు గ్రామాల్లో పర్యటించనున్నామని వివరించారు. ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడతామని పేర్కొన్నారు.

రహదారి బాగుకు యువత చొరవ!


గుంతలు పూడ్చుతున్న యువకులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేట మార్గంలో దెబ్బతిన్న రహదారి మరమ్మతులకు యువత ముందుకు వచ్చారు. రాజయ్యపేటకు చెందిన పిక్కి స్వామి, పేర్ల నల్ల, పొన్నాల భూలోకి, పిక్కి కుమారస్వామి తదితరులు గుంతలను పూడ్చడానికి అవసరమైన రాళ్లు, మట్టి తెచ్చి శనివారం మరమ్మతులు చేశారు. అధికారులు శాశ్వత మరమ్మతులు చేయాలని కోరారు.

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర**, రామచంద్ర: **మార్టిన్**, శ్రీ సత్య: **మా నాన్న**, సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం**, స్క్రీన్2: **శ్వాగ్** వెంకటేశ్వర: **జిగ్రా**, పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్**, షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ జోనల్, ప్రధాన కార్యాలయాల్లో అధికారులు వినతులు స్వీకరిస్తారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, అనధికారిక నిర్మాణాలు, టిడ్కో గృహాల కేటాయింపు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు.

తీరంలో ఇసుక గుట్టలు మాయం!

రాంబిల్లి, న్యూస్‌టుడే

ప్రకృతి వైపరీత్యాలు తీర గ్రామాలపై విరుచుకుపడితే రక్షణ కవచంగా ఉండే ఇసుక తిన్నెలు కొందరి అక్రమార్కులు కారణంగా కనుమరుగవుతున్నాయి. రాత్రివేళ దర్జాగా తీరంలో ఇసుక దిబ్బలను దోచుకుంటున్నారు. దర్జాగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే రెవెన్యూ సిబ్బంది ఉన్నా వారు స్థానికంగా ఉండడం లేదు. కొత్తపట్నం, వాడనర్సాపురం, వాడపాలెం, సీతపాలెం, లోవపాలెం సముద్ర తీరాల నుంచి రోజూ ఇసుక తరలిపోతుంది. ట్రాక్టర్ ఇసుకను దూరాన్ని బట్టి రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు.


వాడపాలెం తీరంలో ఇసుక తవ్వకాలు

ఇసుక కోసం ప్రత్యేక దారులు

తీరం నుంచి ఇసుకను తరలించడం కోసం ప్రత్యేకంగా దారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇసుకలో ట్రాక్టర్లు కూరుకుపోకుండా కొబ్బరి మట్టలతో బాటలు నిర్మించారు. వాడపాలెం తీరంలో కెరటాల సమీపం వరకు బాటను వేశారు. దీనిపై కొందరు మత్స్యకారులు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్లను పట్టుకొని జరిమానాలు విధించినా కొద్దిరోజుల తరవాత నుంచి యథావిధిగా సాగుతోంది. కొత్తపట్నం, వాడనర్సాపురం తీరంలో సామాజిక అటవీ స్థలాలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. ఈ స్థలాలతో పాటుగా తీరం ఒడ్డు వరకు ఉన్న ఇసుక దిబ్బలను తోడేస్తున్నారు. ఇసుక తరలించడంతో ఏర్పడిన గోతుల్లో చేరిన నీరు చెరువులను తలపిస్తుంది.


తీరంలో నిర్మించిన బాట

నిఘా పెంచుతాం



తీరంలో ఇసుక తరలింపులు నిరోధించేందుకు నిఘా పెంచుతాం. తీరంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలను తొలగిస్తే మత్స్యకార గ్రామాలకు తుపానుల నుంచి రక్షణ ఉండే అవకాశం లేదు. సముద్ర ఇసుకను ఎట్టిపరిస్థితుల్లోనూ తరలించకూడదు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. – ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్

కూరగాయల ధరలతో బెంబేలు!

అనకాపల్లి, న్యూస్‌టుడే

మార్కెట్‌లో ఏ కూరగాయ ధరలు చూసినా కేజీ ధర రూ.50లకు తక్కువ లేదు. కొద్ది రోజులుగా అన్ని రకాల కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలు ధరలను చూసి భయపడిపోతున్నారు. అనకాపల్లితో సహా జిల్లా ఎక్కడా రైతు బజార్లు లేవు. దీంతో వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు.


కూరగాయల అమ్మకం

జిల్లాలోని అనకాపల్లి, సబ్బవరం, కశింకోట, అచ్యుతాపురం ప్రాంతాలలో కూరగాయల సాగు ఎక్కువగా చేస్తుంటారు. కర్నూలు, కత్తిపూడి, దార్లపూడి, శంకరపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా కూరగాయలు దిగుమతి చేసుకుంటారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అంతగా రావడం లేదు. మహారాష్ట్రలోని సోలాపూర్, నాసిక్, పూనా, నాగర్ ప్రాంతాల నుంచి ఉల్లి ఇక్కడి చేరేది. అక్కడ నుంచి దిగుమతులు తగ్గిపోవడంతో దీని ప్రభావం ధరలపై పడింది.

కూరగాయలు	కేజీ ధర రూ.
టమాటా	80
ఉల్లి	60
క్యారెట్	50
వంకాయలు	55
బీర	50
దొండ	50
ఆగాకర	100

కానరాని రైతుబజార్లు


రైతుబజారులు ఉంటే ధరలను మార్కెటింగ్ శాఖ అధికారులు నియంత్రిస్తుంటారు. అనకాపల్లి, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పాయకరావుపేట ఇలా ఎక్కడా రైతు బజారులు లేవు. ఇటీవల టమాటా, ఉల్లి ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వం రాయితీ ధరలపై వీటి అమ్మకాలకు శ్రీకారం చుట్టింది. ఏదైన కేజీ రూ.50 అమ్మకం చేపట్టారు. కేవలం ఉదయం సమయంలోనే అమ్మకాలు చేస్తున్నారు. దీనిపై అధికారులు ప్రచారం చేపట్టలేదు. దీంతో ఎక్కడ అమ్మకాలు చేస్తున్నారో చాలా మంది వినియోగదారులకు తెలియడం లేదు.

వైభవంగా శూలాల ఉత్సవం


శూలాలు ధరించిన భక్తులు


మునగపాకలో..

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక, అరబుపాలెం, వాడ్రాపల్లి, గణపర్తి తదితర గ్రామాల్లో వందలాది మంది భక్తులు శనివారం రాత్రి శూలాల ఉత్సవం నిర్వహించారు. [illegible] శూలాలు ధరించారు. వీధుల్లో శూలాలతో ప్రదర్శనలు చేసి అగ్నిగుండాల నుంచి నడిచివెళ్లారు. గ్రామాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేశారు. సాయిబాబా ఆలయంలో లింగాకారంలో దీపారాధన చేశారు.


కొత్తపాలెంలో..


హరిపాలెం రామాలయం వద్ద భక్తులు


ఘటాలతో..

దుర్గా భవానీ.. దయచూపు తల్లీ!

అనకాపల్లి/ పట్టణం, లక్ష్మీదేవిపేట, కొత్తూరు, కశింకోట, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాలను ఊరేగింపు మధ్య భక్తులు శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనకాపల్లి నూకాలమ్మ ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. [illegible]

ఎలమంచిలి/ గ్రామీణం, న్యూస్‌టుడే: [illegible]

నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, న్యూస్‌టుడే: [illegible]


అనకాపల్లి నూకాలమ్మ ఆలయంలో పూర్ణాహుతి


అమ్మవారి విగ్రహం ఊరేగింపు


కొత్తూరులో..


కనకదుర్గ ఆలయంలో కొణతాలకు అమ్మవారి చిత్రం అందజేత


ఎలమంచిలిలో..


నర్సింగబిల్లిలో పీలా గోవింద సత్యనారాయణ పూజలు


శారదానది ఒడ్డున నిమజ్జనోత్సవాల సందడి


నక్కపల్లిలో..


గొల్లపేటలో చిన్నారుల కోలాటం


ఉపమాకలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరం 10న

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత కంటి వైద్యశిబిరం దసరా కారణంగా నవంబర్ 10కి వాయిదా వేసినట్లు సంస్థ భారతీయ భాగస్వామి దొరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శిబిరానికి వెయ్యి మంది వరకు వస్తున్నారని, గతంలో నెలకు రెండు శిబిరాలు నిర్వహించేవారిమని, ప్రస్తుతం నెలకు ఒక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

కస్తూరి తిలకా.. గోవిందా!



కశింకోట, న్యూస్‌టుడే: విజయదశమి పురస్కరించుకొని కశింకోట శ్రీవేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామివారిని శనివారం పుష్పాలతో, తులసీదళాలతో అలంకరించారు. సాయంత్రం విష్ణు సహస్రనామార్చన, రాత్రికి ప్రత్యేక హారతి సమర్పించారు. భక్తులు కస్తూరి తిలకా.. గోవిందా అంటూ కీర్తించారు.

పాముకాటుకు రైతు మృతి

ఎలమంచిలి పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరానికి చెందిన రైతు కొలపాటి సన్యాసిరావు (53) పాముకాటుకు గురై మృతి చెందినట్లు పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. పొలంలో యూరియా జల్లుతుండగా పాముకాటు వేసింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

భవానీ మాలధారిణి దుర్మరణం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి వ్యాను ఢీకొన్న ప్రమాదంలో భవానీ మాలధారిణి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లాకు చెందిన పోలవరపు అప్పల నరసమ్మ(50) బంధువులతో కలిసి భవాని మాల దీక్షను విరమించేందుకు బస్సులో విజయవాడ బయలుదేరారు. కొవ్వూరు పట్టణ శివారు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న వాహనం టైర్లలోని గాలిని తనిఖీ చేసేందుకు డ్రైవర్ బస్సు ఆపారు. ఇంతలో వెనుక నుంచి ఐషర్ వ్యాన్ వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో ఉన్న నరసమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు నరసమ్మను పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై పట్టణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దినచర్యలో నడక భాగం కావాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: మంచి ఆరోగ్యం కోసం ఉదయపు నడకను దినచర్యలో భాగం చేసుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అంతర్జాతీయ కార్యదర్శి సత్యనాదం పేర్కొన్నారు. పట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం యోగా, ప్రాణాయామం, సంతులిత ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంతో జీవించవచ్చని వివరించారు. ఏరియా అధ్యక్షులు డాక్టర్ డి.డి. నాయుడు, క్లబ్ అధ్యక్షులు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు శివ, కోశాధికారి రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.



సత్యనాదంను సత్కరిస్తున్న సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల కలయికతో సందడిగా మారింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు బోధించిన గురువులను సన్మానించారు. ఏటా కలవాలని తీర్మానించారు.


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పారిశుద్ధ్యం అధ్వానం


రహదారి ఒడ్డునే చెత్త

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడకలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. డీపీఓ శిరీషారాణి ఆదేశించినా ఇక్కడ పెద్దగా మార్పు కనిపించడంలేదు. వీధులు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో జ్వరాలు భారినపడుతున్నారు. సర్పంచి ఇంటి ముందు చెత్త తొలగించడంలేదు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి ప్రోత్సాహం తప్పనిసరి

కశింకోట, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధికి పూర్తి ప్రోత్సాహం అందించాలని ఉపాధ్యాయులు ఏవీఎన్ మూర్తి తల్లిదండ్రులకు సూచించారు. 'విద్యార్థి మేలుకో' కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెదురుపర్తిలో విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని బాలికా శక్తిని వివరిస్తూ వారు ప్రయోజకులు అయ్యేవరకు ప్రోత్సాహం తప్పనిసరిగా అందించాలని, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులకు డ్రైఫ్రూట్స్ అందించారు.


వెదురుపర్తిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లి దాసరిగెడ్డ రోడ్డులో కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. ఈ కారణంగా దోమలు పెరిగిపోతున్నాయి.
– రాము, అనకాపల్లి

✓: కాలువను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం.
– రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

చల్‌చల్ గుర్రం..

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ధర్మవరం-అగ్రహారంలో శనివారం అంతర్ జిల్లాల గుర్రపు పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, సర్పంచి కలిగెట్ల రత్నం, ఉప సర్పంచి కలిగొట్ల మాణిక్యం, తెలుగు యువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీను, మాజీ ఉప సర్పంచి సియ్యాదుల అచ్యుత్ పోటీలను ప్రారంభించారు. 13 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. తొలి మూడు స్థానాల్లో కాకినాడ జిల్లా కోటనందూరు, చోడవరం మండలం రామన్నపాలెం, మునగపాక మండలం రాయపురాజుపేట గుర్రాలు నిలిచాయి. అనంతరం నిర్వాహకులు తొలి అయిదు స్థానాల్లో నిలిచిన గుర్రాల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. వివిధ గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.


పరుగు తీస్తున్న గుర్రం

వ్యర్థాలకు నిప్పు.. వాహనదారులకు ముప్పు



చీడికాడ మండలం సిరిజాం గ్రామంలో సేకరించిన వ్యర్థాలను సమీపంలోని కొండ గెడ్డ వంతెన వద్ద పడేస్తున్నారు. వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు పొగతో కళ్లుమండి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వ్యర్థాలను సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

క్రికెట్ టోర్నీ విజేత బలిరెడ్డి జట్టు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా బలిరెడ్డి ప్రసాద్ జట్టు నిలిచింది. దసరా సందర్భంగా గ్రౌండ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూలు మైదానంలో ఈ నెల 6 నుంచి 13 వరకు క్రికెట్ టోర్నీ సీజన్-1 పోటీలు జరిగాయి. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లోని ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. బలిరెడ్డి ప్రసాద్, గెంజి శేఖర్ జట్ల మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. శేఖర్ జట్టుపై ప్రసాద్ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. శేఖర్, గొర్లె నాయుడు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజయనగరం డీఎస్పీ సిరిసిల్ల ప్రసాద్, రావికమతం ఎస్సై రఘువర్మ, సర్పంచి మోది నాయుడు, హైస్కూలు విద్యా కమిటీ ఛైర్మన్ అప్పారావు విజేతలకు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు.


విజేతలకు నగదు, జ్ఞాపిక అందిస్తున్న డీఎస్పీ

నర్సీపట్నం
• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల


వంతెన పక్కగా వస్తున్న పొగ

వ్యర్థాలకు నిప్పు.. వాహనదారులకు ముప్పు

చీడికాడ మండలం సిరిజాం గ్రామంలో సేకరించిన వ్యర్థాలను సమీపంలోని కొండ గెడ్డ వంతెన వద్ద పడేస్తున్నారు. వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు పొగతో కళ్లమండి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వ్యర్థాలను సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

వీధి కుక్కలతో హడల్

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణ వాసులను వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ వాహన చోదకుల వెంట పడుతున్నాయి. కొత్తూరు కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు, యడ్లవీధిలో పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్నాయి. స్థానిక సీహెచ్‌సీకి రోజూ కుక్కకాటు బాధితులు ఐదుగురికిపైగా వస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


యడ్లవీధిలో కుక్కల గుంపు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: విశ్వం, మార్టిన్ ఆడి2: జిగ్రా, శ్వాగ్, మా నాన్న సూపర్ హీరో ఆడి3: దేవర, ఆడి4: వేట్టయన్, జనక అయితే గనక రాజు: వేట్టయన్ బంగార్రాజు: దేవర, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వేట్టయన్ సాయిలక్ష్మి: శ్వాగ్, పూర్ణా: దేవర

అ వీ ఇ వీ

ఎంపీ, ఎమ్మెల్యే రాక నేడు

రోలుగుంట, న్యూస్‌టుడే: ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం రోలుగుంట మండల పర్యటనకు రానున్నారని తెదేపా మండల నాయకులు గుములూరు చంద్రమౌళి, బుల్లిబాబు, కంచుగుమ్మల సర్పంచి బండారు శ్రీనివాసరావు చెప్పారు. శరభవరం, కొవ్వూరు, కొండపాలెం, రోలుగుంట, జె.నాయుడిపాలెం గ్రామాల్లో నూతన రహదారులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చిన్నప్పన్నపాలెంలో నూతనంగా నిర్మించిన పైడిమాంబ ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రం తిరువీధోత్సవాలు, జలాధివాసం, మండపాలకు విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. 16న ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, అదే రోజు మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

పల్లె పండగ గ్రామసభలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 16 నుంచి 19 వరకు పల్లె పండగ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. కోమళ్లపూడి, లింగభూపాలపుర అగ్రహారం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, పెదమదిన, చినమదిన, కరక, సీతయ్యపేట, పెదపూడి, పెదపూడి అగ్రహారం గ్రామాల్లో 16న సభలు జరుగుతాయన్నారు.

కంటి వైద్యశిబిరం నవంబర్ 10న

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత కంటి వైద్యశిబిరం దసరా కారణంగా నవంబర్ 10కి వాయిదా వేసినట్లు సంస్థ భారతీయ భాగస్వామి దొరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శిబిరానికి వెయ్యి మంది వరకు వస్తున్నారని, గతంలో నెలకు రెండు శిబిరాలు నిర్వహించేవారిమని, ప్రస్తుతం నెలకు ఒక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

కుదరని ఏకాభిప్రాయం.. ఎన్నిక వాయిదా

చీడికాడ, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పాల సేకరణ చీడికాడ కేంద్రంలో రెండు డైరక్టర్ల పదవులకు ఎన్నిక నిర్వహించేందుకు సభ్యత్వం ఉన్న రైతులు ఆదివారం సమావేశమయ్యారు. ఎక్కువ మంది పోటీ పడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో డెయిరీ అధికారులు ఎన్నికను వాయిదా వేశారు.

భాజపా బలోపేతానికి కృషి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లోనూ భాజపాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు చెప్పారు. మాకవరపాలెంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పిల్లా బాబూరావు, రుత్తల జమీలు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల వ్యాప్తి

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లోని వరి పొలాల్లో తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉందని వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి ఆదివారం పేర్కొన్నారు. పాముపొడ, సుడిదోమ నివారణకు రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు పురుగు మందులు వాడాలని సూచించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట శివారు రామచంద్రపాలెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగజాతి పాదులు అల్లుకున్నాయి. ఫలితంగా వ్యవసాయ పంపుసెట్లకు తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. విద్యుత్తు సిబ్బంది స్పందించి పాదులను తొలగించాలని కోరుతున్నారు.

ఊరెళ్లొచ్చేలోగా ఊడ్చేస్తారు !

శివారు ప్రాంతాల్లో చోరీలు
కనిపించని పోలీసు గస్తీ

చోడవరం, న్యూస్‌టుడే

"శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ఆడేందుకు తిరుమల వెళ్లాం. తిరిగి వచ్చేలోగా ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాను రోడ్డు వైపు తిప్పేశారు. గడియను, తలుపు చెక్కను కోసేశారు. ఈ నెల 8వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో కెమెరాను రోడ్డు వైపు తిప్పినట్లు రికార్డు అయింద'ని చోడవరం కోఆపరేటివ్ కాలనీకి చెందిన వివాహిత వాపోయారు. నిర్మాణంలో ఉన్న ప్రైవేటు విద్యా సంస్థ భవనంలో విద్యుత్తు తీగలను ఓ యువకుడు పట్టుకుపోయాడు. మరొకరిది మోటారును అపహరించుకుపోయారు.

★ నియోజకవర్గ కేంద్రమైన చోడవరం పట్టణంలో ఇటీవల కాలంలో చోరీలు అధికమయ్యాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చెలరేగిపోతున్నారు. గత పది రోజుల్లో నాలుగు చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంటికి తాళం వేసి ఊరెళ్లాలంటే భయపడే పరిస్థితులున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంటోందని, దొంగతనాలతోపాటు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. గంజాయికి అలవాటు పడిన యువకులు గుంపులుగా చేరి మద్యం తాగుతూ సీసాలను ఇళ్ల ముంగిట పగలగొడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారు. గంజాయి, మద్యం తాగేందుకు డబ్బుల కోసం కొత్తగా నిర్మాణం జరిగే ఇళ్ల వద్ద వస్తువులను ఎత్తుకుపోతున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యుత్తు తీగలు, మోటార్లు, పైపులు మాయమవుతున్నాయి. రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ లేకపోవడం వల్లే చోరీలకు తెగబడుతున్నారని బాధితులు చెబుతున్నారు.


కోఆపరేటివ్ కాలనీలో కోసేసిన తలుపు గడియ


నిర్మాణంలోనున్న ఇంట్లో విద్యుత్తు తీగలను అపహరిస్తున్న దొంగ (సీసీ ఫుటేజ్ చిత్రం)

ముందుగా సమాచారం ఇస్తే..

ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లే వారు ముందుగా పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే.. రాత్రి సమయంలో గస్తీ ఉంచుతాం. వీలైతే ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. నేరాలను నియంత్రించేందుకు పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
– బి.అప్పలరాజు, సీఐ, చోడవరం


సిరిజాం వద్ద బొడ్డేరు నదిలో ఈతకొడుతున్న పిల్లలు

పిల్లలకేం తెలుసు ప్రమాదమని..

పాఠశాలలకు సెలవులు, ఆదివారాల్లో పిల్లలు సమీపంలోని నదులు, చెరువులు, గెడ్డల్లో ఈత కొట్టేందుకు వస్తున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు జలాశయాలన్నీ నిండటంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నదులు, గెడ్డల్లో ప్రవాహ ఉద్ధృతి అధికంగా ఉంటోంది. ఈ సమయంలో పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు ఈత కొట్టేందుకు వస్తున్నారు. చీడికాడ మండలం సిరిజాం సమీపంలోని బొడ్డేరు నదిలో ఆదివారం పలువురు చిన్నారులు ఈత కొడుతుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, చీడికాడ

శ్రీనివాస కల్యాణం గోడపత్రికల ఆవిష్కరణ

నాతవరం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జనవరి 11న నాతవరంలో శ్రీనివాస కల్యాణం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నారై శెట్టి సతీష్ పేర్కొన్నారు. అటవీ శాఖకు చెందిన మైదానాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు చెప్పారు. కల్యాణానికి సంబంధించిన గోడపత్రికలను స్థానిక తెదేపా నాయకులు కరక సత్యనారాయణ, ఎన్.వెంకటరమణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు తదితరులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు.

క్రికెట్ టోర్నీ విజేత బలిరెడ్డి జట్టు

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా బలిరెడ్డి ప్రసాద్ జట్టు నిలిచింది. దసరా సందర్భంగా గ్రౌండ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూలు మైదానంలో ఈ నెల 6 నుంచి 13 వరకు క్రికెట్ టోర్నీ సీజన్-1 పోటీలు జరిగాయి. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లోని ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. బలిరెడ్డి ప్రసాద్, గెంజి శేఖర్ జట్ల మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. శేఖర్ జట్టుపై ప్రసాద్ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. శేఖర్, గొర్లె నాయుడు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజయనగరం డీఎస్పీ సిరిసిల్ల ప్రసాద్, రావికమతం ఎస్సై రఘువర్మ, సర్పంచి మోదినాయుడు, హైస్కూలు విద్యా కమిటీ ఛైర్మన్ అప్పారావు విజేతలకు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు.


టోర్నీ విజేత జట్టుకు నగదు, షీల్డులు అందిస్తున్న డీఎస్పీ ప్రసాద్, ఎస్సై రఘువర్మ, సర్పంచి నాయుడు

అంగరంగ వైభవంగా విజయదశమి


గచ్చపువీధిలో అమ్మవారి ఘటాలతో మహిళలు

నర్సీపట్నం/ అర్బన్, మాకవరపాలెం, నాతవరం, న్యూస్‌టుడే: మహిళల కోలాటం, యువకుల డప్పుల చప్పుళ్లు, అమ్మవారి ఘటాలతో భక్తుల కోలాహలం నడుమ దుర్గాదేవి విగ్రహాలు ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలాయి. నర్సీపట్నంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ ముగింపు కార్యక్రమానికి శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు దంపతులు హాజరయ్యారు. ఈవో సాంబశివరావు తదితరులు అయ్యన్న దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. గచ్చపువీధి, బలిఘట్టంలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాలతో మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. తాండవ ఎడమ కాలువ మీదుగా నిమజ్జనానికి దుర్గాదేవి విగ్రహాలను తరలించారు. నాతవరంలో శక్తిపంచాయతన ఆలయం నుంచి నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. బూరుగుపాలెంలో అమ్మవారి లడ్డూను వేలంలో సర్పంచి వబ్బలరెడ్డి వెంకటరమణ రూ.35 వేలకు దక్కించుకున్నారు. పెదబొడ్డేపల్లిలోని జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో గజముఖ నృత్య అకాడమీ విద్యార్థినులు భరతనాట్య ప్రదర్శన చేశారు. వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


వేలంలో లడ్డూ పాడిన సర్పంచి వెంకటరమణ

బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట: వడ్డాది, విజయరామరాజుపేట, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. వడ్డాది పెదబజారు వీధి మండపంలో అమ్మవారిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు దర్శించుకుని పూజలు చేశారు. కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి నిలువెత్తు విగ్రహాన్ని పూలమాలలు, చెరకు గడలతో అలంకరించారు. టి.అర్జాపురంలో బాల వరసిద్ధి వినాయక ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణశర్మ, రామారావుల ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు ప్రదక్షిణలు చేసి అపరాజితాదేవికి పూజలు చేశారు. చిలకవానిపాలెంలో దుర్గాదేవి మండపం వద్ద సహస్ర దీపారాధన ఆకట్టుకుంది. రోలుగుంటలో 101 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు.


అయ్యన్న దంపతులకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ఈవో తదితరులు

కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి: చౌడువాడలో పశురమ్మతల్లి పండగ సంప్రదాయబద్ధంగా జరిగింది. చీడికాడ, అర్జునగిరి, ఖండివరం, బి.సింగవరం, బైలపూడి, అడవి అగ్రహారం, తునివలస, చుక్కపల్లి, ఎల్బీపట్నం గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దేవరాపల్లిలో ఉమామహేశ్వరి దేవీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించి శారదా నదిలో నిమజ్జనం చేశారు.



వడ్డాది పెదబజారు వీధిలో అమ్మవారిని దర్శించుకున్న తాతయ్యబాబు తదితరులు, చిలకలవానిపాలెంలో సహస్ర దీపాలంకరణ


దేవరాపల్లిలో దురాదేవి విగ్రహ నిమజ్జన ఊరేగింపు


చీడికాడ మండలం అర్జునగిరిలో..

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

కట్టడిపై దృష్టిసారించని యంత్రాంగం

కె.కోటపాడు, న్యూస్‌టుడే

దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో నాటుసారా తయారీ కేంద్రాలు అధికంగా ఉన్నాయి. మన్యం నుంచి మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల మీదుగా గంజాయి రవాణా జరుగుతోంది. నాటుసారా, గంజాయి రవాణాను సమర్థంగా అరికట్టేందుకు కె.కోటపాడులో ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. చీడికాడ మండలం బైలపూడి నుంచి కె.కోటపాడు మండలం మీదుగా తరలుతున్న గంజాయి కె.కోటపాడు, ఎ.కోడూరు పోలీసుల తనిఖీల్లో తరచూ పట్టుబడుతోంది. గతంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను తొలగించడంతో నాటుసారా, గంజాయి రవాణాకు గేట్లు తెరచినట్లయిందని స్థానికులు చెబుతున్నారు.


ఆటో, గంజాయి నిందితులతో ఎ.కోడూరు ఎస్సై, సిబ్బంది

తరలింపు ఇలా..

ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో పండించే గంజాయిని అనంతగిరి మీదుగా పినకోట, పెదకోట నుంచి దేవరాపల్లి, ఆనందపురం, కొత్తవలస మీదుగా విశాఖకు తరలిస్తున్నారు. కె.కోటపాడు, చౌడువాడ, మల్లపాలెం, గవరవరం, పాచిలివానిపాలెం, చౌడువాడ మీదుగానూ విశాఖ, అనకాపల్లి రైల్వేస్టేషన్లకు తరలించి అక్కడ్నుంచి దూర ప్రాంతాలకు పంపుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 21 ఆనందపురంలో ఎ.కోడూరు ఎస్సై లక్ష్మీనారాయణ సిబ్బందితో తనిఖీలు చేపట్టి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే నెల 25న కె.కోటపాడు ఎస్సై ధనుంజయ బత్తివానిపాలెం వద్ద కారులో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు.


ఇటీవల పట్టుకున్న గంజాయి బస్తాలు, స్వాధీనం చేసుకున్న కారుతో కె.కోటపాడు పోలీసులు

కట్టడి చేస్తాం

గంజాయి రవాణాను సమర్థంగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. కూటమి ప్రభుత్వం కొత్తగా మద్యం దుకాణాలను ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే గంజాయిపై దృష్టిసారిస్తాం.
– పాపునాయుడు, సీఐ, చోడవరం

భవన నిర్మాణ కార్మికులకు బిందెల పంపిణీ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కింతాడ శివారు కూండ్రపువానిపాలెంలో విజయదశమి సందర్భంగా తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నూరు సూర్యనారాయణ భవన నిర్మాణ కార్మికులు 80 మందికి స్టీల్ బిందెలు, పెద్ద పళ్లేలు, చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎస్సై ధనుంజయ, తెదేపా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, వెంకటరావు, కన్నూరు అప్పలనాయుడు పాల్గొన్నారు.


కార్మికులకు పంపిణీ చేస్తున్న ఎస్సై ధనుంజయ, సూర్యనారాయణ తదితరులు

వృథా ఎవరికీ పట్టదా..?

రావికమతం, న్యూస్‌టుడే: మేడివాడలో వీధి కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. 3,500 జనాభా ఉన్న గ్రామంలో ఉదయం, సాయంత్రం కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. జల్‌జీవన్ మిషన్ పనులు నేటికీ పూర్తి కాలేదు. పలు వీధుల్లోని కుళాయిలకు ట్యాపులు లేవు. ట్యాంకు నుంచి నీటిని వదిలిన ప్రతిసారీ తాగునీరు వృథా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని రెల్లి కాలనీ, మోడల్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కుళాయిలకు ట్యాపులు లేకపోవడంతో కర్ర ముక్కను బిరడాగా పెట్టారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి లింగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా.. ట్యాపులు లేనిచోట కొత్తవి బిగిస్తామని పేర్కొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రం వద్ద కుళాయికి కర్ర ముక్కే బిరడా


రెల్లి కాలనీలో ట్యాప్ లేక పోతున్న తాగునీరు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: గొండుపాలెంలో నాగిరెడ్డి వారి పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. కనీసం మరమ్మతు చేయాలి.
– అప్పల నాయుడు, గొండుపాలెం

★ రోడ్డును పరిశీలించి ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తాం.
– బాలాజీ అప్పారావు, ఏఈ, కె.కోటపాడు

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ బీటలు వారింది. కూలిపోక ముందే మరమ్మతు చేయించాలి.
– అప్పారావు, కె.కోటపాడు

★ ప్రహరీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. – నాగమణి, ప్రిన్సిపల్, కె.కోటపాడు

చిన్నారులకు దూరంగా..


కందిపూడిలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కందిపూడిలో అంగన్‌వాడీ భవనం ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉంది. ఐదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తయినా చిన్నచిన్న పనులు మిగిలిపోయాయి. గచ్చు, పెయింటింగ్, విద్యుద్దీకరణ పూర్తి చేయకుండా వైకాపా ప్రభుత్వం వదిలేయడంతో భవనం అందుబాటులోకి రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పక్కనే ఉన్న సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ వసతుల్లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. గది లోపల సామగ్రి ఉంటే పిల్లలు బయట వరండాలోనే కూర్చోవాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు పోయే దారేది?

గొలుగొండ, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ ఎ.ఎల్.పురం హైస్కూల్ రోడ్డులో మురుగు నీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. వర్షం వస్తే మోకాలి లోతున నీరు చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ కాలువ పూడిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


హైస్కూల్ రోడ్డులో మురుగు

తుప్పలు ఇలా.. వెళ్లేదెలా?

ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగాయి. రోలుగుంట జడ్పీ పాఠశాలకు వెళ్లే దారి తుప్పలతో మూసుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ దారిలో రెండుసార్లు పాములు కనిపించడంతో అటుగా వెళ్లేందుకు భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రోలుగుంట


హైస్కూలు సమీపంలో ప్రమాదకరంగా పొదలు

పునాదులు దాటని గ్రంథాలయ నిర్మాణం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నారాయణరాజుపేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయి. మూడేళ్ల కిందట నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు విడుదల కాకపోవడంతో పునాదుల్లోనే వదిలేశారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ఏయూలో ఫ్రీడమ్ రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : భారత ఇంధనం, శక్తి సంస్థ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ఆంధ్రవిశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ఐ.వెంకటేశ్వరరావు మాణిక్యాలరావు పాల్గొన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రామునాయుడు, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, సబ్బవరం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: సబ్బవరం పంచాయతీ కోమటివీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. స్థానికులు తరచూ అనారోగ్య బారిన పడుతున్నారు.
– బి.వెంకటరమణ, సబ్బవరం

సమాధానం: పరిశీలించి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం.
– డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

పల్లెల్లో అభివృద్ధి పండగ

ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. కేంద్రం, ఆర్థిక సంఘాల నుంచి విడుదలయ్యే నిధులను సైతం పక్కదారి పట్టించింది. దీంతో పల్లెలు కనీస వసతులకు నోచుకోలేకపోయాయి. ప్రగతి పడకేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కనీసం పారిశుద్ధ్య నిర్వహణ పనులు కూడా చేయలేక సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పాలనపై దృష్టి సారించడంతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. గత ప్రభుత్వ తప్పులను సరిదిద్ది పల్లెల ముఖచిత్రాన్ని మార్చేందుకు కృషి చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్రం ఇచ్చే నిధులు నేరుగా పంచాయతీ ఖాతాల్లో పడుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తీరనున్నాయి. ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుంది. ఉపాధిహామీ పథకం నిధులతో సీసీరోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.


పరవాడ గ్రామపంచాయతీ కార్యాలయం

నియోజకవర్గంలోని 54 పంచాయతీల్లో..

పెందుర్తి మండలంలో 15, సబ్బవరంలో 24, పరవాడలో 15 చొప్పున మొత్తం 54 పంచాయతీలు ఉన్నాయి. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా 54 పంచాయతీల్లో రూ. 15.26 కోట్లు వెచ్చించి 208 పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల ప్రణాళికలను మండల పరిషత్తు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తీర్చిదిద్దారు. వారోత్సవాల్లో ఆయా పనులకు శంకుస్థాపన చేసి వచ్చే సంక్రాంతి నాటికి పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తారు.

మండలాల వారీగా చేపటనున్న పనులు, నిధులు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో..)
పెందుర్తి	80	4.46
పరవాడ	65	6.74
సబ్బవరం	63	4.06
మొత్తం	208	15.26

గ్రామసభలోనే పనులను గుర్తించేలా..

గ్రామ పంచాయతీల్లో గత ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రజలు, పాలకుల సమక్షంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పల్లెల్లో పెండింగ్ పనులు, ప్రధాన సమస్యలు, జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు. ఏయే పనులు చేపట్టాలనే విషయంపై సమష్టిగా నిర్ణయం తీసుకోవడంతో పాటు ప్రణాళికలు రూపొందించారు. తొలి ప్రాధాన్యంగా సీసీరోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ప్రజల నుంచి వినతులకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందరూ భాగస్వాములు కావాలి..



పల్లె పండగ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తాం. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు చేతులమీదుగా శంకుస్థాపనలు చేయిస్తాం. డిసెంబరు 31లోగా పనులను పూర్తి చేస్తాం. జనవరిలో మరలా పల్లె పండగ వారోత్సవాలు జరిపి అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేస్తాం. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి. – శ్యామ్‌సుందర్, ఎంపీడీవో, పరవాడ

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

పెందుర్తి, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన దేవీ విగ్రహాల నిమజ్జనోత్సవాలను నగర సీపీ శంఖబ్రత బాగ్చీ పరిశీలించారు. పెందుర్తి, సరిపల్లిలోని చెరువుల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సరిపల్లి చెరువు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె పండగ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యాలయం తెలిపింది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన సుమారు 216 పనులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు శంకుస్థాపనలు చేస్తారని, ఆ మేరకు రోజువారీ షెడ్యూలును ప్రకటనలో తెలియజేశారు.

★ 14న ముదపాక పంచాయతీలో ఉదయం 9 గంటల నుంచి పల్లె పండగ ప్రారంభమవుతుంది. అనంతరం గుర్రమ్మపాలెం, వాలిమెరక, ఎస్‌ఆర్‌పురం మధ్యాహ్నం గవరపాలెం, గొరపల్లి, పినగాడి, రాంపురం గ్రామాల్లో శంకుస్థాపనలు చేస్తారు. 17న జెర్రిపోతులపాలెం, చింతగట్ల, పెదగాడి, చింతల్గ్రహారం, సరిపల్లి, జుగాలపాలెం, రాజయ్యపేట కార్యక్రమాలు జరుగనున్నాయి.

★ 15న సబ్బవరం మండలంలోని మొగలిపురం, మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, అంతకాపల్లి, గొటివాడ, గాలిభీమవరం, ఇరువాడ, 18న వంగలి, టెక్కలిపాలెం, రాయపుర అగ్రహారం, బంగారమ్మపాలెం, ఆరిపాక, నల్లరేగులపాలెం, నారపాడు, బాటజంగాలపాలెం, అసకపల్లి, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం, 20న సబ్బవరం, అమృతపురం, తవ్వవానిపాలెంలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు.


పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే

★ 16న పరవాడ మండలంలోని పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం, ఈ.బోనంగి, పి.బోనంగి, 19న ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, రావాడ, కలపాక గ్రామాల్లో పల్లె పండగలు జరుపుతారని ప్రకటనలో ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

చేయి చేయి కలిపి.. షెడ్డు నిర్మించి..

గవరజగ్గయ్యపాలెం (వేపగుంట), న్యూస్‌టుడే: గ్రామానికి ఏదైనా మంచిపని చేయాలని యువత తలచి ముందడుగేస్తే ఎలాంటి అభివృద్ధి పనులు చేయొచ్చో నిరూపించారు గవరజగ్గయ్యపాలెం గ్రామంలోని యువకులు. ఆ గ్రామంలోని శ్మశానవాటిక షెడ్డు శిథిలావస్థకు చేరి దహన సంస్కారాల సమయంలో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాడైన షెడ్డు, తుప్పలతో నిండిన శ్మశానవాటిక ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని గ్రామ యువకులు బుదిరెడ్డి శివ, ముత్తా అర్జున్, పొలమరశెట్టి భాను, పోలరాజు మురళీకృష్ణ, ముత్తా గోపి, గనిశెట్టి కుమార్, గల్లా భాగ్యరాజు, గండ్రెడ్డి శ్యామ్‌కుమార్, గండ్రెడ్డి అచ్యుతకుమార్, తనకాల అనిల్ కుమార్, చిడగం చక్రిసాయి, అశోక్, గల్లా త్రినాథ్, బొడ్డేటి వినోద్, బాలు, వాసు, సంతోష్, ముత్తా సత్తిబాబు, తనకాల చలపతిరావు, పొలమరశెట్టి భూలిరాజు, మురళి, మన్మథరావు, నాగేశ్వరరావు కలిసి సుమారు రూ. 50 వేలు చందా వేసుకున్నారు. పాత షెడ్డును తొలగించి కొత్తది నిర్మించారు. తుప్పలను తొలగించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. యువకులు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొత్తగా నిర్మించిన శ్మశానవాటిక వద్ద దాతలు

వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట దరి రవినగర్ శేషాద్రి శిఖరంపైగల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్ర శ్రవణ నక్షత్ర వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రవణ నక్షత్రం, విజయదశమి ఒకేరోజు రావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకంతో అర్చనలు జరిపారు. వెంకటసాయిగణేష్ చెందిన స్వామిభక్తులు గౌరునాయుడు, రామలక్ష్మి దంపతులు, యజ్ఞేశ్వర్, ప్రవళ్లిక కుటుంబీకుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర పూజలు ఘనంగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు.


రవినగర్ కల్యాణ వేంకటేశ్వరుడికి హారతిస్తున్న అర్చకుడు


ఈ.బోనంగి శ్రీనివాసుడు

సిరుల స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేదపఠనాల మధ్య స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్తర వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్లు నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.


పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి మరుబాయి గ్రామంలో దసరా ఉత్సవాలు సందర్భంగా శనివారం దుర్గా బాయ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 23 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో వైజాగ్, గాజువాక, వడ్లపూడి, లోకల్ కృష్ణా బాయ్స్ జట్లు విజేతలుగా నిలిచాయి. వీరికి వరుసగా రూ.12, వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను స్థానిక నాయకులు మంత్రి రవి, కాకి శ్రీను, సర్వరే ఆలం, నక్క శ్రీను చేతుల మీదుగా అందజేశారు. పెదతాడి, పరవాడలో పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మరుబాయిలో వాలీబాల్ విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు, కమిటీ ప్రతినిధులు


పరవాడలో బహుమతులు పంపిణీ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంప్రదాయ కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు పాల్గొన్నారు.


పెందుర్తిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో..


రాంపురం దరి మహాకామేశ్వరి పీఠంలో..


ఎస్‌ఆర్‌పురంలో రాజరాజేశ్వరి..



శారద పీఠంలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న పీఠాధిపతులు


శ్రామశక్తినగర్‌లో..


నాయుడుతోటలో..

జయ శుభకారిణి.. విజయ రూపిణి

అసుర గణాలను సంహరించి విజయ రూపిణిగా అవతరించిన జగన్మాతను భక్తులు నవరాత్రులు ప్రత్యేక పూజలు జరిపి ఘనంగా వీడ్కోలు పలికారు. నియోజకవర్గంలో పలు ఆలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు వైభవోపేతంగా జరిగిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం విజయదశమి పురస్కరించుకుని ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయాల్లో విశేష హోమాలు, పూర్ణాహుతులు, ఉద్వాసన పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవార్ల ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. పలు చోట్ల అన్న సమారాధన చేశారు. – న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


సింహాద్రి ఎన్టీపీసీలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న అమ్మవారి ప్రతిమలు


చింతల్గ్రహారం కృష్ణాలయంలో సారె సమర్పణ


పరవాడలో మహిళల కోలాటం


కృష్ణానగర్‌లో కలశాలతో ఊరేగింపు


పెదనాయుడుపాలెంలో..



దేవీపురం రాజరాజేశ్వరి మణిపురం భువనేశ్వరి


దీపాంజలినగర్‌లో రావణాసుర వధ

గెడ్డలోని నీరు రహదారిపైకి..

గెడ్డలో ప్రవహించాల్సిన వరద రోడ్లపై పారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ మండలం కలపాక నుంచి పిట్టవానిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలోని గెడ్డవాగు వద్ద కల్వర్టు నిర్మించకపోవడంతో వర్షాల సమయంలో పెద్దఎత్తున వరద రహదారిపై ప్రవహించడంతో పాటు రోడ్డు కోతకు గురవుతోంది. ఆ సమయంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదని పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఎన్టీపీసీ, హిందుజా పరిశ్రమలకు వెళ్లే కార్మికులతో పాటు పిట్టవానిపాలెం, కలపాక, దేవాడ, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, మరడదాసరిపేట గ్రామాల ప్రజలతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – పరవాడ, న్యూస్‌టుడే

దర్పణం




వేలం నిర్వహించే ప్రాంగణం పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వేలం ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మద్యం వేలం ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సిరిపురం బాలల ప్రాంగణాన్ని సందర్శించారు. మద్యం వేలం ప్రక్రియలో దరఖాస్తులు అధికంగా రావడంతో ఆశావహులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. కౌంటర్లు అధికంగా ఏర్పాటు చేయాలన్నారు. వేలం ప్రక్రియ సజావుగా, సక్రమంగా ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

క్రైం ఎస్సై బాధ్యతల స్వీకరణ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం నేరవిభాగం ఎస్సైగా జి.తేజేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్థులు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైల్వేలో స్వచ్ఛతకు కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : రైళ్ల వినియోగదారులకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి మేము కృషిచేస్తామని డి.ఆర్.ఎం. సౌరభ్‌ప్రసాద్ అన్నారు. వాల్తేరు డివిజన్‌లో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. వాల్తేరు డివిజన్ పర్యావరణ విభాగం, ఎన్.జి.ఒ.లు సంయుక్తంగా 'స్వచ్ఛపరివార్ - స్వచ్ఛ సంవాద్' పేరుతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని డివిజన్‌లో పలు ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు.



శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

సబ్బవరం తహసీల్దారుగా చిన్ని కృష్ణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల తహసీల్దారుగా బి.చిన్ని కృష్ణ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాకు కేటాయించడంతో ఇక్కడి కలెక్టర్ విజయకృష్ణన్ అతన్ని సబ్బవరం తహసీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం విధుల్లో చేరనున్నారు.

ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అమలు

స్వల్ప మార్పులతో ఆదరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే

మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణకు నూతన విధానం అమలులోకి తెచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తండోపతండాలుగా ప్రజలు తరలి వచ్చిన ఫిర్యాదులు అందజేయడాన్ని కమిషనర్ సంపత్ కుమార్ చూశారు. దీంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శాశ్వత ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చేవారు తమ పేరు, ఆధార్, సమస్యను సోమవారం నుంచి శనివారం వరకు పని దినాలలో అందించేలా చర్యలు తీసుకున్నారు. దీని కోసం జీవీఎంసీలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ కేంద్రంలో ఎలాంటి ఫిర్యాదులు స్వీకరిస్తారో తెలిసేలా ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయించారు. అయినా సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల రాక తగ్గడం లేదు. దీంతో ప్రత్యేకంగా ఐదుగురు సిబ్బందిని నియమించి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. నేరుగా కమిషనర్ లేదా మేయరును కలిసి ఫిర్యాదు చేయాలనే ఉద్దేశ్యం ఫిర్యాదీదారుల్లో కనిపిస్తోంది.


వివరాలతో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

గత కమిషనర్లు అవలంబించిన విధానాలను తర్వాత వచ్చిన కమిషనర్లు పట్టించుకోవడం లేదు. గతంలో జీవీఎంసీలో ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రికార్డింగ్ సిస్టం) అమలు చేసేవారు. ఈ విధానంలో నగర ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేసేవారు. కమిషనర్లు ఉదయం పూట క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సి ఉంటుంది. దీంతో నేరుగా ఐవీఆర్ఎస్ కేంద్రానికి వెళ్లి అక్కడికి వచ్చిన సమస్యలపై ఫిర్యాదీదారులతో మాట్లాడేవారు. తర్వాత క్షేత్ర స్థాయికి వెళ్లి ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రానికి వచ్చిన వారితో కమిషనర్ లేదా మేయరు ఇతర అధికారులెవరైనా ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యను తీసుకుని పరిష్కరిస్తే ఈ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. తద్వారా సోమవారమే కాకుండా మిగతా రోజుల్లోనూ ఫిర్యాదులు ఇచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ఫిర్యాదుల కేంద్రానికి వచ్చే సమస్యలపై వారానికోసారి సమీక్ష నిర్వహిస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి.


మహా విశాఖ నగరపాలక సంస్థలో ఆధునికీకరించిన ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం